పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి

- నలుగురికి ఉపాధి కల్పిస్తున్న బీటెక్ చదివిన యువకుడు
- భీమవరంలో ఎస్ఆర్ మష్రూమ్స్ పేరిట సాగు





భీమవరం ఉండి రోడ్డులో పుట్టగొడుగుల ఫామ్, తయారైన మష్రూమ్స్


మష్రూమ్స్ ఫామ్‌లో పనిచేస్తున్న భాను లక్ష్మీప్రసాద్

భీమవరం(ప్రకాశం చౌక్): ఉన్నత చదువు ఉంటే ఊరి దాటి వెళ్లి లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగం చేసే ఈరోజుల్లో లక్షల్లో జీతం వద్దని సొంతూరులోనే పుట్టగొడుగులు సాగు చేసి ఉపాధి పొందుతున్నాడు బిటెక్ (సివిల్ ఇంజినీరింగ్) చదివిన భీమవరం పట్టణం 22 వార్డు రెస్ట్‌హౌస్ ప్రాంతానికి చెందిన పడమటి భాను లక్ష్మీ ప్రసాద్. సాగుపై మకరంతో మిల్క్ మష్రూమ్స్ (పుట్టగొడుగులు) సాగు చేస్తూ నెలకు రూ.లక్షలు సంపాదిస్తున్నాడు. కోట్లు విలువ చేసే సంతృప్తి పొందుతున్నాడు. మరో నలుగురికి ఉపాధి కల్పించి వారి కుటుంబాలకు ఆసరాగా నిలబడ్డాడు. పుట్టగొడుగులను విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. ఆసక్తి ఉన్న వారికి పట్టుగొడుగుల సాగుపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఆరోగ్యానికి మేలు

పుట్టగొడుగులు ఆరోగ్యానికి ఎంతో మేలు. పుట్టగొడుగుల్లో ఫైబర్, ఐరన్, తదితర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగులతో కూరలు, పకోడీ, అప్పడాలు, కేకులు కూడా తయారు చేసుకోవచ్చు. వీటిని పిల్లలు కూడా తినొచ్చు. రెస్టారెంట్లు, పంక్షన్లలో నాన్‌వేజ్ కర్రిగా మష్రూమ్ ఎంతో ఫేమస్‌గా ఉంది. డాక్టర్లు, ఆరోగ్య సలహాలు ఇచ్చే వారు సైతం మష్రూమ్ ఐటమ్‌ను సూచిస్తున్నారు.

పుట్టగొడుగులు తయారీ ఇలా

ఎంపిక చేసుకున్న షెడ్డులో 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలి. కవర్‌తో తయారు చేసిన బ్యాగులో మట్టి, గడ్డి విత్తనాలు వేసి ఆరు లేయర్లుగా పేర్చి రెండు భాగాలుగా చేసి ఎత్తుల్లో పేర్చాలి. నీరు మాత్రమే చల్లుతూ చికటి గదిలో 21 రోజులు, అనంతరం వెలుగు గదిలో 12 రోజులు ఉంచితే పుట్టగొడుగులు బ్యాగుల నుంచి నాలుగు నుంచి ఐదు వరకు వస్తాయి. అనంతరం వాటిని వినియోగించుకోవచ్చు.

మష్రూమ్ సాగుపై ఆసక్తి



నాకు ఉద్యోగం కంటే సాగుపైనే ఆసక్తితో ఫ్రీడమ్ యాప్‌లో మష్రూమ్స్ ఫార్మింగ్‌పై శిక్షణ పొందాను. భీమవరం ఉండి రోడ్డులో 2400 చదరపు అడుగుల్లో నిర్మించిన షెడ్డు అద్దెకు తీసుకున్నాను. రూ.2.50 లక్షలతో సాగు ప్రారంభించాను. ఈ సాగులో ఆదాయం కంటే చేస్తున్న పనిలోనే ఎక్కువ సంతృప్తి ఉంది. నా తల్లిదండ్రులు, మా అక్కల సహకారం, ప్రోత్సాహంతో విజయవంతగా పుట్టగొడుల సాగు చేసి మంచి ఉపాధి పొందుతున్నాను.

– భానులక్ష్మీ ప్రసాద్, ఎస్ఆర్ మష్రూమ్స్ ఫార్మర్

నేడు ‘అమిత్ షా గోబ్యాక్’


వామపక్ష పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: రాజ్యసభలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా, కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్‌షా గో బ్యాక్ అనే నినాదంతో ఆదివారం భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వామపక్ష పార్టీలతో కలిసి ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ తెలిపారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో శనివారం వామపక్షపార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేధావి అంబేడ్కర్ పట్ల అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దోశద్రోహమేనని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం నిర్వహించే ఆందోళనలో రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్వర్డ్‌బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, ఎంసీపీఐయూ నాయకుడు మహంకాళీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి


క్రికెట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ పేరిచర్ల

భీమవరం అర్బన్: ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామస్థాయిలో నిర్వహించిన టెన్నీస్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభ కనబరిచేందుకు గ్రామస్థాయి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ప్రతి వ్యక్తి రోజుకు 1 నుంచి 3 గంటల వరకు క్రీడలు ఆడితే ఆ రోజు మానసిక ప్రశాంతతతో పాటు ఉల్లాసం చేకూరుతుందన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు సన్నీ, చందు, బద్రి, సుమంత్, మహేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో బుద్ధరాజు శ్రీనివాసరాజు, కోమటి రవి, గొట్టుముక్కల లక్ష్మీపతిరాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి


ఉల్లాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవి కిరణ్ కుమార్

వీరవాసరం: మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి డ్వాక్రా మహిళ పనిచేయాలని ఎంపీడీఓ కె.రవి కిరణ్ కుమార్ అన్నారు. వీరవాసరం డ్వాక్రా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అభివృద్ధి సాధిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఏపీఎం కె.జ్యోతిరాణి మాట్లాడుతూ మహిళామణులకు ఆర్థిక విద్య ,అడల్ట్ ఎడ్యుకేషన్, ఈ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై మండలంలో ఎంపిక చేసిన 20 మంది వీఎల్వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వీరు గ్రామాల్లో మహిళలకు అడల్ట్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కామిశెట్టి వీర విజయలక్ష్మి, పంపన మల్లేశ్వరి, విప్పర్తి సరోజిని, కె.శ్రీరామ్ మూర్తి, బి.మణికుమారి, ఎస్‌వీ పద్మావతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పోలీసు జిల్లా ప్రధాన కార్యాలయ అవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

భీమవరం: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణలోని పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషినల్ ఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ ఉద్యోగులంతా తమ కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు గుడ్డ సంచులు వాడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, సైబర్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ జీవీవీ నాగేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

వీరవాసరంలో స్వచ్ఛత

వీరవాసరం: భీమవరం ప్రాజెక్టు పరిధిలో వీరవాసరం అంగన్‌వాడీ సెంటర్‌లో స్వచ్ఛత కార్యక్రమం సీడీపీఓ టి.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. నెలలో మూడవ శనివారం శుభ్రత, పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్మీకాంతం అన్నారు. 192 అంగన్‌వాడీ సెంటర్లలో పరిశుభ్రత కార్యక్రమం చేసినట్టు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు పి.నాగరత్నం, శాంతి, సత్యవతి, హెల్పర్స్, పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు.

అపూర్వ కలయిక


ఉండి జెడ్పీ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

ఉండి: ఏరా ఎలా ఉన్నావు? ఎక్కడుంటున్నావు? ఎంతమంది పిల్లలు? ఏం చేస్తున్నావు? అంటూ ఇలా అడగిన ప్రశ్నలు అడగకుండా నిరాటంకంగా ఒకరిని మరొకరు ప్రశ్నలు వేసుకుంటూ చెప్పలేని సంతోషంతో చిన్ననాటి స్నేహితులతో ఉండి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణమంతా శనివారం కళకళలాడింది. ఇదే స్కూల్‌లో చదువుకున్న 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పెట్టుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ముఖ్యంగా ఆనాటి ఉపాధ్యాయులు తోటకూర సుశీల, అలగిరి ఆనంద్, అడవి సురేష్‌కుమార్, గేదెల వెంకటరామారావు, పద్మజా రాణి, కృష్ణంరాజు తదితర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారి చేతుల మీదుగా పూర్వవిద్యార్థులు జ్ఞాపికలను అందుకున్నారు.

నాగిడిపాలెం బ్రిడ్జికి సాంబమూర్తి పేరు పెట్టాలి


సాంబమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

భీమవరం అర్బన్: భీమవరం మండలం నాగిడిపాలెంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జికి భూ పోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి (గెడ్డం సాంబమూర్తి) పేరు పెట్టాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. భీమవరం మండలం నాగిడిపాలెం గ్రామంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ భూ పోరాట యోధుడు గెడ్డం సాంబమూర్తి వల్లే ఈ ప్రాంతంలో మత్స్యకారులకు ఎక్కువ భూములు దక్కాయన్నారు. 1990వ దశకంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ నాగిడిపాలెం వచ్చినప్పుడు నాటు పడవపై తిప్పి ఈ ప్రాంత కష్టాలను చూపించిన మహనీయుడు సాంబమూర్తి అన్నారు. డి పట్టాలు పొందిన పేదలకు తక్షణమే పట్టదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని, హామీ లేని పంట రుణాలు ఇవ్వాలని, బంజరు భూములు సాగు చేస్తున్న గ్రామీణ పేదలందరికీ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించాలని, ఆక్వా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలుత సాంబమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కన్వీనర్‌గా తిరుమాని శ్రీరాములు, సహాయ కన్వీనర్‌గా నాగిడి సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్, రూరల్ మండల సీపీఐ కార్యదర్శి ఎం సీతారామ్ ప్రసాద్, నాగిడి నాగరాజు, ఎం లక్ష్మీపతి, నాగిడి శాంతామూర్తి, సత్యనారాయ; తిరుమాని శ్రీరాములు, గోపయ్య, నాగిడి ఆంజనేయులు, పొన్నమండ రామజోగి, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో గ్యాస్ సిలిండర్ల సీజ్


సిలిండర్లను సీజ్ చేయిస్తున్న జేసీ, అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆయన భీమవరం పట్టణంలోని 11 హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీటిలోని 8 హోటళ్లలో వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల గ్యాస్ సిలిండర్లకు బదులుగా గృహ అవసరాలకు వినియోగించే 37 సబ్సిడీ సిలిండర్లను అక్రమంగా వాడుతున్నట్టు గుర్తించారు. 37 సిలిండర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని జేసీ తెలిపారు. తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్ సరోజ, ఏఎస్‌ఓ శివ శంకర్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత


బాధితులకు సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: మండలంలోని వడ్డిలంక గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య–నాగమణి, కామన నాగేశ్వరరావు–దుర్గాభవాని ఇతర కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. అనంతరం తనవంతు సహాయంగా బాధితులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, లుంగీ, టవల్స్, చీరలు, రూ. 2000 నగదు అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ పొన్నమండ నాగరాజు, నారిన మెరక ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు ఆరుమిల్లి లక్ష్మణరావు, పొన్నమండ ముత్యాలరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, ఉచ్చుల స్టాలిన్, మోకా ప్రేమ్‌చంద్, లంక చిరంజీవి, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, చెన్ను విజయ్, గంటా నరేష్, పాలపర్తి కృపానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

పెనుమంట్ర: నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశానికి విద్యార్థులకు పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పెనుమంట్ర, అత్తిలి, పెనుగొండ, ఇరగవరం మండలాలకు చెందిన 221 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరిశీలకుడు, ఆలమూరు హైస్కూల్ హెచ్ఎం బి.సుబ్బారావు తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా గంగాదేవి జాతర


వస్తువులు తీసుకెళ్తున్న గణేశ్న కుటుంబికులు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో ఉన్న గంగాదేవి అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. గణేశ్న వారి కుటుంబికుల ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల నుంచి ఆనవాయితీగా చేస్తున్న ఈ జాతరలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత గణేశ్న వారి కుటుంబికులు అమ్మవారి ప్రతిమకు శాస్త్రోక్తంగా కోనేరు స్నానం చేయించి అమ్మవారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఊరేగింపుగా వస్తున్న అమ్మవారికి మహిళలు, భక్తులు చీరలు పానుపుగా పరిచి నడిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విద్యార్థి శశికాంత్‌కు అభినందన


విద్యార్థి శశికాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రధాని మోదీ పరీక్ష పే చర్చ–2025 8వ ఎడిషన్ ముందస్తు సదస్సులో స్థానిక ఆదిత్య స్కూల్ విద్యార్థి బీఎన్ఎస్ శశికాంత్ పాల్గొన్నట్టు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు శనివారం తెలిపారు. సదస్సులో రాష్ట్రం నుంచి పాల్గొన్న 8 మందిలో శశికాంత్ ఒకరని అన్నారు. ఈ సందర్భంగా శశికాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, సిబ్బంది యు.యుగసుధ, కె.సత్యనారాయణ, గైడ్ టీచర్ కె.వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


ప్రమాదానికి గురైన దినమనస్సును పరామర్శిస్తున్న నాయకులు

ఆకివీడు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెరుగు దినమనస్సు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం శనివారం ఆయన స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో గుండా సుందర రామనాయుడు, గుండుగొలను ధనరాజు, చిగురుపాటి చిట్టిబాబు, జ్ఞానరాజు, అయి భీమవరం రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఊరేగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో కొలువై ఉన్న భక్తాంజనేయ స్వామివారి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని మేళ, తాళాలు, బాణసంచా నడుమ వైభవంగా ఊరేగించారు. ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు స్వామి వారిని వైభవ వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. దర్శనానంతరం దాతల ఆర్థిక సహకారంతో ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నాప్రగడ చక్రధరరావు, కొండేటి రామకృష్ణారావు, అడ్డాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. చినరంగనిపాలెం, రామచంద్రపురం, మారుతీనగర్, నెహ్రూ కాలనీ, బొక్కా వారిపాలెం, కలెక్టరేట్ ప్రాంతం, మల్లెతోట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

బాలుడికి గాయాలు

భీమవరం: రోడ్డు ప్రమాదంలో బాలుడు గాయపడినట్టు వన్‌టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని గులాబి సెంటర్‌కు చెందిన బొర్రా కోటేశ్వరరావు శనివారం స్కూల్ బ్యాగ్ తగిలించుకుని రోడ్డుపై నడుస్తుండగా ఆటుగా వస్తున్న ట్రాక్టర్ కొక్కానికి స్కూల్ బ్యాగ్ పట్టుకుని ఈడ్చుకుపోయింది. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును చికిత్స కోసం విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని హెచ్‌సీ తెలిపారు.

జూదరుల అరెస్ట్

భీమవరం: టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై రెహమాన్ శనివారం చెప్పారు. బలుసుమూడి బీసీ కాలనీలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి ఏడుగుర్ని అరెస్టు చేసి, వారినుంచి రూ.38 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

నిరక్షరాస్యతను రూపుమాపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మూర్తి

పెనుగొండ: నిరక్షరాస్యతను రూపు మాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిరక్షరాస్యులకు ఉపయోగపడేలా ఈ–ఉల్లాస్‌పై అవగాహనకు వీఓఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీఎం టి.పుష్పావతి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు సాంకేతిక విద్య, క్రియాత్మక విద్య, ఆర్థిక విద్య అభ్యాసులకు నేర్పించడానికి వీఓఏలుగా పని చేస్తున్న వారిని వలంటీర్లుగా ఎంపిక చేసేందుకు ఈ శిక్షణనిచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర


చలువ పందిళ్లతో ఆలయ ప్రాంగణం

నరసాపురం రూరల్: మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ వారి జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించి అనంతరం దర్శనం కల్పిస్తారు. పూజలు అనంతరం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు జాతర నిర్వహించి అమ్మవారిని సాగనంపుతారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నాడు ముక్కనము వెళ్లిన మరసటి బుధవారం లేదా ఆదివారం రోజున అమ్మవారు జాతరను నిర్వహించడం ఆనవాయితీ. జాతర నేపథ్యంలో అమ్మవారి ఘటాలను ఉంచే పూరిపాక పరిసరాలను విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

శివాలయంలో రంగస్థలం నటుడు మహేష్ పూజలు

పాలకొల్లు అర్బన్: ప్రముఖ సినీ నటుడు, రంగస్థలం మహేష్ సోమవారం మండలంలోని శివదేవునిచిక్కాల శివాలయంలో సందడి చేశారు. శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం స్వామి ఆలయంలో ఆయన మొక్కునాటారు. అలాగే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సిద్ధాంతి ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి)ని ప్రత్యేకంగా కలుసుకుని ఆశీర్వచనాలు పొందారు.